జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



మంగళవారం | 27-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 111 పేజీలు: 8 వెల : రూ.7


## త్వరలో మహిళలకు..

# ఉచిత బస్సు ప్రయాణం

* కర్ణాటక, తమిళనాడులో రాష్ట్ర బృందం అధ్యయనం చేసింది
* ప్రజా ఆకాంక్షలకనుగుణంగా పనిచేస్తాం
* ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తాం
* జిల్లాలో పారదర్శకంగానే బదిలీలు
* దళారులను నమ్మి మోసపోవద్దు
* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
* మూడు బస్సులకు పచ్చజెండా
* కోటబొమ్మాళి, టెక్కలిలో అన్నా క్యాంటీన్లు ప్రారంభం

**టెక్కలి, ఆగస్టు 26 (వార్త):** కర్ణాటక, తెలంగాణలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర బృందం అధ్యయనం చేసిందని, త్వరలోనే రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి, కోటబొమ్మాళిలో సోమవారం అన్నా క్యాంటీన్లను ప్రారంభించారు. అలాగే టెక్కలిలో మూడు కొత్త ఆర్టీసీ బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. పేదవాడి కడుపు నింపే అన్నా క్యాంటీన్‌లను శ్రీ కృష్ణాష్టమి రోజు ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కోటబొమ్మాళిలో ప్రతిరోజూ 400మందికి, టెక్కలిలో 300మందికి సరిపడేలా రూ.5లకే మధ్యాహ్న భోజన సదుపాయాన్ని అందజేస్తున్నామన్నారు. ముందు ముందు అల్పాహారం, రాత్రి భోజనాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం 13లక్షల కోట్లు అప్పులు చేసిందని, ప్రస్తుతం ఆదాయం కనిపించే పరిస్థితి లేదని, అయినా ఇచ్చిన మాట తప్పకుండా హామీలన్నీ అమలు చేస్తామని, ఇప్పటికే పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్ల ప్రారంభం జరిగాయన్నారు. జిల్లాలో బదిలీలు పారదర్శకం జరుగుతాయని, దళారులను ఎవరూ ఆశ్రయించవద్దని, అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో తాను ఒక పూట ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి, మరో పూట క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించేందుకు నిర్ణయించుకున్నానని ప్రతి వీధి తిరుగుతూ సమస్యలను పరిష్కరిస్తానని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అన్న క్యాంటీన్లకు ఆర్థిక ప్రోత్సాహం అందించిన దాతలను రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. కోటబొమ్మాళికి చెందిన డాక్టర్ బలగ మురళి రూ.లక్ష అందించగా, జామి చలపతిరావు రూ.10 వేలు.. అందించారు. అవకాశం ఉన్న దాతలు అందరూ అన్న క్యాంటీన్లకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.






## తల్లి మందలించిందని..

* కాలువలో దూకిన యువకుడు
* గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, స్థానికులు
* కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబీకులు



**హిరమండలం, ఆగస్టు 26 (వార్త):** హిరమండలం మేజర్ పంచాయతీ మైత్రీకాలనీకి చెందిన జోగి దుర్గాప్రసాద్ ఎక్కువగా మద్యం తాగుతున్నాడు. ఈవిషయమై తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన దుర్గాప్రసాద్ సోమవారం గొట్టాబ్యారేజీ కుడికాలువలోకి దూకేశాడు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా కాలువలో నీరు ఎక్కువగా ఉండడంతో ఫలితం లేకపోయింది. దీంతో కుటుంబీకులు హిరమండలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ జి.నారాయణ స్వామి సంఘటన ప్రాంతానికి చేరుకుని కుడి కాలువలో ప్రవహిస్తున్న నీటిని తగ్గించాలని గొట్టాబ్యారేజీ అధికారులకు సూచించారు. కొత్తూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కుడి ప్రధాన కాలువలో నీటి ప్రవాహం తగ్గిన వెంటనే గల్లంతైన యువకుడిని వెతికేందుకు చర్యలు చేపట్టారు. చీకటి కావడంతో వెతికేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. తల్లి జోగి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



### కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

**టెక్కలి:** బొప్పాయిపురం పంచాయతీ చల్లపేట గ్రామానికి చెందిన సీహెచ్ మల్లేసు సోమవారం మధ్యాహ్నం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబసభ్యులు హుటాహుటిన జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అయితే మల్లేసు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేసి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మల్లేసు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు గ్రామస్థులు తెలిపారు.

# పాలకొండ సబ్ కలెక్టర్‌గా యశ్వంత్ రెడ్డి

పాలకొండ, ఆగస్టు 26 (వార్త): పాలకొండ సబ్ కలెక్టర్‌గా సి.యశ్వంత్‌రెడ్డి నియమితులయ్యారు. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. సరికొత్తగా మన్యం జిల్లా ఏర్పాటైన తర్వాత పాలకొండ డివిజన్‌ను సబ్ కలెక్టర్ స్థాయికి పెంచారు. ఆ మేరకు కార్యాలయం తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో మొట్ట మొదటిసారిగా ఐఏఎస్ అధికారి నురల్ కమల్ విధులు నిర్వహించారు. పాలకొండ పట్టణ అభివృద్ధికి కొత్తగా వస్తున్న సబ్ కలెక్టర్ త్వరగా చర్యలు చేపట్టాలని పాలకొండ ప్రజలు కోరుతున్నారు.



# గోకులకృష్ణ..గోపాలకృష్ణ

■ వాడవాడలా భక్తి, శ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ■ శ్రీకూర్మలో పూజలు చేసిన ఎమ్మెల్యే మామిడి

మందస, ఆగస్టు 26(వార్త): జగద్గురువు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తి, శ్రద్ధలతో జరిపారు. చిన్ని కృష్ణుని వేషధారణలను తమ పిల్లలకు వేసి, వారి తల్లిదండ్రులు మురిసిపోయారు. బాలకృష్ణుని విగ్రహాలను ఊయలలో వేసి, జోలపాటలను పాడారు. ప్రత్యేక పూజలు కూడా చేశారు. మందసలోని శ్రీరాజగోపాల స్వామి ఆలయంలో జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చకుడు నిర్మలాపాణిగ్రాహి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, కృష్ణునికి ఊయలలో శయనింపజేసి, జోల పాటలు పాడారు. ఈ సందర్భంగా గోమాతలకు పూజలు చేసి, అన్నదానం జరిపారు. శ్రీసత్యసాయి మందిరంలో రాత్రి ఏడు గంటల నుంచి జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆధ్యాత్మికవేత్త, సంప్రదాయ సన్యాసి స్వామి బాలకృష్ణదాసాజీమహారాజ్ శ్రీకృష్ణుని జన్మవృత్తాంతం, లీలలు, మహిమలు వివరించారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.





శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న అర్చకుడు నిర్మలాపాణిగ్రాహి

హిరమండలం, ఆగస్టు 26 (వార్త): ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కిట్టాలపాడు పంచాయతీలోని 'కూర్మ గ్రామాన్ని' సోమవారం ఆయన సందర్శించి కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. రాధాకృష్ణుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కూర్మ గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని నిర్వాహకులకు అందించారు. ఈసందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఆయన గ్రామంలోని వర్ణాశ్రమ కళాశాల, వేద పాఠశాల, గోశాల, వారి జీవన శైలిని, ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒత్తిళ్లతో కూడిన ఆధునిక యాంత్రిక యుగంలో... పురాతన గ్రామీణ భారతీయ జీవన విధానాన్ని ఎలా సాగించవచ్చో చూపిస్తున్నారని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. ఆయన వెంట తెదేపా నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాద్, ఎంపీపీ ప్రతినిధి టి.తిరుపతిరావు మాస్టారు, మండల తెదేపా అధ్యక్షుడు యాళ్ల నాగేశ్వరరావు, గోళ్ల సింహాచలం, ఎంజీఆర్ యువసేన అధ్యక్షులు పోతురాజు శ్రీధర్, సభ్యులు సాయి, దాము తదితరులు ఉన్నారు.



శ్రీకూర్మ గ్రామంలో శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గోవింద్

## బాలికల వసతిగృహంలో ..

**నరసన్నపేట:** నరసన్నపేటలోని స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతిగృహంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం చేపట్టిన ఈ వేడుకల్లో భాగంగా గృహ సంక్షేమ అధికారిణి సూర్యప్రభ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని వేషధారణలో బాలికలు అలరించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని స్తుతిస్తూ నిర్వహించిన పాటలకు నృత్య ప్రదర్శన అందజేశారు. ప్రతి ఏడాది ఈ వేడుకలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.



# లక్‌పతిదీదీతో మహిళల ఆర్థికాభివృద్ధి



మందస, ఆగస్టు 26 (వార్త): మందస మండల సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లక్‌పతి దీదీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వయం సహాయక సభ్యులు తిలకించారు. అనంతరం ఏపీఎం ప్రసాదరావు మాట్లాడుతూ లక్‌పతి దీదీ ద్వారా అందించే రుణాలతో మహిళా జీవితాలు ప్రగతి బాటలో నడవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వయం సహాయక సభ్యుల కోసం ప్రవేశపెట్టిన పథకం వారికి వరం అని, ఈ లక్ పతి దీదీ ద్వారా మహిళలకు జీవనోపాధులు కల్పించుకోవచ్చని అవగాహన కల్పించారు. అనంతరం ఆయన లక్‌పతి దీదీలకు, సీఆర్పీలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ కోశాధికారి బాలక విజయశ్రీ, అకౌంటెంట్ కల్యాణి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

# చత్తీస్‌గఢ్ తెలుగు మహా సంఘం నూతన కార్యవర్గం




సోంపేట, ఆగస్టు 26(వార్త): చత్తీస్‌గఢ్ తెలుగు మహా సంఘం రాష్ట్ర సమావేశం ఆ రాష్ట్ర రాజధాని రాయపూర్‌లో దేవేందర్‌నగర్‌లోని ఆంధ్ర అసోసియేషన్ భవనంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ప్రధాన కార్యదర్శి బి.తులసీరావు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన విభిన్న సంఘాల ప్రతినిధులకు స్వాగతం పలికారు. మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మురళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహా సంఘం కార్యవర్గాన్ని విస్తరణ చేసి సమావేశంలో ప్రకటించారు. నూతన కార్యవర్గం వివరాలు ఇలా ఉన్నాయి.

సీనియర్ ఉపాధ్యక్షుడిగా జగదల్‌పూర్ నుంచి ఎం.జయంతనాయుడు (బస్తర్ జిల్లా ఆంధ్ర సమాజ్), ఉపాధ్యక్షులుగా బిలాస్‌పూర్ నుంచి బి.వేణుగోపాలరావు (అధ్యక్షుడు, సంయుక్త తెలుగు సమాజ్), భిలాయి నుంచి బర్రి జోగారావు(అధ్యక్షుడు, భిలాయి తెలుగు సమాజ్), రాయపూర్ నుంచి టి.శ్రీనివాస్‌రెడ్డి (ఉపాధ్యక్షుడు, ఆంధ్ర అసోసియేషన్) ఎన్నికయ్యారు. ఉప ప్రధాన కార్యదర్శిగా రాయపూర్ నుంచి ఎస్.గణేష్ (తెలుగు వెల్ఫేర్ సొసైటీ), కార్యదర్శులుగా జగదళ్‌పూర్ నుంచి కె.సుబ్బారావు(ప్రధాన కార్యదర్శి, బస్తర్ జిల్లా ఆంధ్ర సమాజ్), భిలాయి నుంచి సీహెచ్ శ్రీనివాస్ (ప్రధాన కార్యదర్శి, ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి), బిలాస్‌పూర్ నుంచి ఆర్.మనోరథబాబు (ఆంధ్ర సమాజ్), రాయపూర్ నుంచి ఏకే శ్రీనివాసమూర్తి (ఆంధ్ర బ్రాహ్మణ సమాజ్)ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కోర్బా నుంచి పి.ఆదినారాయణ, భిలాయి నుంచి కొండప్ప వెంకటరావు, టీవీ నాగేశ్వరరావు, ఎం.జానకీరావు, జగదళ్‌పూర్ నుంచి కె.యశోవర్ధనరావు, వీర్రాజు, బిలాస్‌పూర్ నుంచి జి.రవికన్న, రాయపూర్ నుంచి ఎన్ఎన్ రావు, సీహెచ్ భీమారావు, టి.యాదవ్‌రావు, డి.ఈశ్వరరావును నియమించారు. మహా సంఘం సంరక్ష కుడుగా జి.స్వామి (అధ్యక్షుడు, ఆంధ్ర అసోసియేషన్, రాయపూర్), సలహాదారుడుగా ఎం.బాబూరావు (ప్రిన్సిపాల్, అభ్యుదయ ఆంధ్ర హైస్కూలు, భిలాయి), కన్వీనర్‌గా రుద్రమూర్తి నియమితులయ్యారు.

# నరసన్నపేట పంచాయతీ ఈవోగా ద్రాక్షాయిని



నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త): నరసన్నపేట మేజర్ పంచాయతీ ఈవోగా ద్రాక్షాయినిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈమె బొరిగివలస పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. గ్రేడ్-2 నుంచి గ్రేడ్ వన్‌గా పదోన్నతి రావడంతో ఇక్కడకు బదిలీ చేశారు. మూడు రోజుల్లో తాను బాధ్యతలు స్వీకరిస్తానని ద్రాక్షాయిని తెలిపారు.

# ఎమ్మార్సీ కేంద్రాలకు చేరిన ప్రశ్నపత్రాలు



నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త): నరసన్నపేట మండలంలోని 84 పాఠశాలల్లో ఈనెల 27 నుంచి నిర్వహించే ఎస్ఏ పరీక్షల ప్రశ్నాపత్రాలు సోమవారం ఎంఈవో కార్యాలయానికి చేరాయి. సెప్టెంబరు నాలుగో తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఎంఈవో శాంతారావు తెలిపారు. ప్రశ్నపత్రాలను హెచ్‌ఎంలు తీసుకువెళ్లాలని ఆయన కోరారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు విద్య శాఖ అధికారులు చెప్పారు.

# ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

నరసన్నపేట, ఆగస్టు 26(వార్త): జలుమూరు, పోలాకి, నరసన్నపేట మండలాల్లో ఇసుక అక్రమ రవాణా నిరోధానికి నదికి వెళ్లే మార్గాల్లో రెవెన్యూ, మైన్స్ అధికారులు ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. నదీ తీర గ్రామాల్లో పర్యవేక్షణ చేపడుతున్నట్లు రెవెన్యూ అధికారులు చెప్పారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పాత పెన్షన్ విధానమే పునరుద్ధరించాలి

నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త): పాత పెన్షన్ విధానమే ఉద్యోగుల సమస్యకు ఏకైక పరిష్కార మార్గమని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న యునైటెడ్ పెన్షన్ విధానం కాకుండా పాత పెన్షన్ విధానమే ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో సంఘం ముందంజలో ఉందన్నారు. సీపీఎస్ గానీ, యూపీఎస్ విధానంలోగానీ తమకు ఒరిగేదేమీ లేదన్నారు. ఓపీఎస్ తప్ప ఏ విధానాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని స్పష్టం చేశారు. పెన్షన్ విధానంపై ప్రభుత్వాలు కుప్పిగంతులు వేయకుండా ఓపీఎస్‌నే అమలు చేయాలని కోరారు.





## ధరివాడ గ్రామంలో వైద్య శిబిరం

జలుమూరు, ఆగస్టు 26 (వార్త):అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.శ్రీకాంత్ ఆదేశాల మేరకు జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం దరివాడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి ఆహార పదార్థాలు భుజించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని త్రాగమని, భోజనం ముందు, మలవిసర్జన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని అవగాహన కల్పించారు. అన్ని బావులలో క్లోరినేషన్ చేయించారు. రోగులకు నేత్ర వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో యు.చిన్నరాజులు, ఆప్తాలమిక్ అధికారి వీబీజీ రాజు, సత్య, నాగమణి, ధనం, ప్రమీల, ఆరోగ్య సహాయకుడు చిన్నారావు, రవి, వెంకటరావు, నాగేశ్వరరావు, ఆశ కార్మికులు పాల్గొన్నారు.

## నేడు సొండిపూడిలో మెగా వైద్య శిబిరం

మందస, ఆగస్టు 26 (వార్త): మందస మండలంలోని సొండిపూడిలో ఈ నెల 27న మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు జెమ్స్ (రాగోలు) ఏరియా మేనేజర్ రాపాక తిరుపతిరావు తెలిపారు. సొండిపూడి సచివాలయం పరిధిలో గల ప్రజలకు అన్ని సాధారణ, కిడ్నీ, గుండె, కేన్సర్, వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సొండిపూడి, మూలిపాడు సర్పంచ్‌లు చిచ్చుల నళిని, గుసిరి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు దడ్డ దమయంతి ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు నుంచి శిబిరం ప్రారంభమవుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మాజీ మంత్రిని కలిసిన సీఐ మోహన్



పలాస, ఆగస్టు 26 (వార్త): ఇటీవల పలాస అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన దాడి మోహనరావు .. మాజీ మంత్రి గౌతు శివాజీని శాసనంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈసందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను శివాజీ అడిగి తెలుసుకున్నారు.

## నేడు మందసలో బీజేపీ సభ్యత్వ నమోదు

మందస, ఆగస్టు 26 (వార్త): మందసలోని శాసనాం వీధిలో గల శ్రీ అన్నపూర్ణ దేవి ఆలయం ఆవరణలో ఈనెల 27న భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దేవానంద పట్నాయక్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వైకాపా సీనియర్ నేత లింగయ్య మృతి



మందస, ఆగస్టు 26 (వార్త): మందస మండలంలోని భైరిసారంగపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రట్టి లింగయ్య సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ లో పనిచేసిన ఆయన.. ఉద్యోగ విరమణ అనంతరం రాజకీయాల్లో చురుకుగా ఉండేవారు. లింగయ్య భార్య సరస్వతికి రెండు సార్లు సర్పంచ్‌గా పనిచేశారు. రెండు రోజుల క్రితం నుంచి జ్వరంతో బాధపడుతున్న ఆయనకు మెరుగైన చికి త్సకు శ్రీకాకుళం తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మరణించారు. లింగయ్య మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

## మడపాం కార్యదర్శి టెక్కలికి బదిలీ

నరసన్నపేట, ఆగస్టు 26(వార్త): మడపాం పంచాయతీ కార్యదర్శి కేవీవీ జగన్నాథంను టెక్కలి పంచాయతీ ఈవోగా బదిలీ చేశారు. ఈ విషయమై సోమవారం ఆయన మాట్లాడుతూ.. తనకు గ్రేడ్ 2 నుంచి గ్రేడ్ 1గా పదోన్నతి లభించిందని తెలిపారు. ఇక్కడ కార్యదర్శిగా సమర్థవంతంగా విధులు నిర్వహించానన్నారు.



# శ్రీముఖలింగేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు





జలుమూరు, ఆగస్టు 26 (వార్త): శ్రీముఖలింగం గ్రామంలో ఉన్న శ్రీముఖలింగేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి కలిసి రావడంతో భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టామని ఆలయ కార్యనిర్వహణ అధికారి ప్రభాకరరావు తెలిపారు.

### శ్రీముఖలింగేశ్వరుని సేవలో ఎమ్మెల్యే మామిడి

శ్రీముఖలింగంలో కొలువైన శ్రీముఖలింగేశ్వర స్వామిని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దర్శించుకున్నారు. సోమవారం ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవదాయ శాఖ అధికారులు, సర్పంచ్ టి.సతీష్, మాజీ సర్పంచ్ టి.బలరాం, టీడీపీ నాయకులు దేవ మాస్టారు సాదరంగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ అర్చకులు ఆలయ విశిష్టతను ఆయనకు తెలిపారు.

### ఉంగటూరు ఎమ్మెల్యే ధర్మరాజు..

శ్రీముఖలింగేశ్వర స్వామిని ఉంగటూరు ఎమ్మెల్యే ధర్మరాజు సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవదాయ శాఖ అధికారులు, సర్పంచ్ టి.సతీష్, మాజీ సర్పంచ్ టి.బలరాం,టీడీపీ నాయకులు దేవ మాస్టారు సాదరంగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. ముఖలింగేశ్వర ఆలయంలోని గర్భగుడిలో ఉండే గోలెం నిండా బియ్యాన్ని నింపారు. పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సీఎం కావడంతో మొక్కును తీర్చుకున్నట్టు తెలిపారు. ఆయన వెంట జనసేన నాయకులు ఉన్నారు.



# గొప్ప మానవతావాది మదర్‌థెరిస్సా



పాతపట్నం, ఆగస్టు 26(వార్త): భారతరత్న, నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మదర్‌థెరిస్సా 114వ జయంతిని సోమవారం పాతపట్నం మండలం కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాంశాలలో ప్రధానోపాధ్యాయులు బిసిరింగి సింహాచలం, రామరాజు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పారశెల్లి రామరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సారవకోట మండల విద్యాశాఖ అధికారి మడ్డు వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మదర్‌థెరిస్సా గొప్ప మానవతావాదని , ఆమె జీవితం అందరికీ ఆచరణీయమన్నారు. మిషనరీస్ ఆఫ్ చారిటీని భారతదేశంలోని కలకత్తాలో 1950లో స్థాపించి పేదలకు, రోగగ్రస్తులకు, అనాథలకు, మరణశయ్యపై ఉన్న వారికి సేవలు అందించిన గొప్ప మానవతావాది మదర్‌థెరిస్సా అని వారు కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్

పాలకొండ, ఆగస్టు 26(వార్త): పార్వతీపురం మన్యం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోడి సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శిగా వెన్నపు చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షులుగా పల్లా కొండబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ మన్యం జిల్లాలో కబడ్డీ క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రభుత్వ, పెద్దల సహకారంతో మెరుగైన సదుపాయాల కోసం కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు




పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మన్యం జిల్లా కబడ్డీ సీనియర్, జూనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

జలుమూరు, ఆగస్టు 26(వార్త): జలుమూరు మండలం బుడితి సబ్ స్టేషన్ పరిధిలో పలు మరమ్మతుల నిర్వహణకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ఉన్న గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

## నేడు మందసలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

మందస, ఆగస్టు 26 (వార్త): మందసలో గల శ్రీవాసుదేవ దేవాలయంలో ఈ నెల 27న శ్రీకృష్ణాష్టమమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం మంగళవారం రాత్రి వరకు రోహిణి నక్షత్రం ఉన్నందున ఆ రోజునే శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు గమనించాలని వారు కోరారు.

## నేడు, రేపు ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ పర్యటన

జలుమూరు, ఆగస్టు 26(వార్త): శ్రీకాకుళం జిల్లాలో ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ మంగళ, బుధవారాల్లో పర్యటించనున్నారు. జలుమూరు మండలం ఎస్టీ మాకివలస గ్రామంలో మంగళవారం పర్యటించి, గిరిజనుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తారు. హిరమండలం మండలం అంతకాపల్లి, పునుపేట, సవతిసీది గిరిజన గ్రామాల్లో పర్యటిస్తారు. బుధవారం ఆమదాలవలస మండలం అల్లి పిల్లిగూడాలో పర్యటిస్తారు. పాతపట్నం మండలం నల్లబొంతు గిరిజన గ్రామం లో పర్యటించి, ఆ గ్రామంలో ఉండే ఆదివాసీల నుంచి వినతిపత్రాలు స్వీకరి స్తారు. కమిషన్ పర్యటనను ఆదివాసీ సంఘాలు విజయవంతం చేయాలని అధికారులు కోరారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## ఆదిత్యుని సన్నిధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**అరసవల్లి, ఆగస్టు 26(వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చేనెల 3 వరకూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కొనసాగుతాయని శంకరశర్మ తెలిపారు. అనివెట్టి మండపంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో భక్తులతో పాటు ఆలయ ఈవో డి.ఎల్.వి. రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు..

# జిల్లా క్రీడాకారులు

* ఈనెల 31, వచ్చే నెల 1న తిరుపతి వేదికగా రాష్ట్ర స్థాయి పోటీలు * జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులు ఎంపిక * ఉత్సాహంగా జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు * పోటీలను ప్రారంభించిన ఏపీ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను

**శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు26 (వార్త):** రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 31, వచ్చే నెల 1వ తేదీలలో తిరుపతి వేదికగా రాష్ట్ర స్థాయి తైక్వాం డో పోటీలు జరుగనుండగా జిల్లా స్థాయిలో ఆదివారం జట్టు ఎంపికలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో టౌన్ హాల్ వేదికగా జరిగిన పోటీలలో జిల్లా నలుమూలల నుం చి క్రీడాకారులు తరలివచ్చారు. ఈ పోటీలను ఆంధ్ర ప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తైక్వాం డో శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా తైక్వాండో శ్రీను మాట్లాడుతూ తిరుపతిలోని నేషనల్ సంస్కృత యూనివర్శిటీలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల 1వ తేదీన రెండవ అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్(ఖేలో ఇండియా) -2024 పోటీలు జరుగనున్నాయన్నారు. అదే తేదీల్లో తిరుపతిలోని కర కంబడి రోడ్డులో గల తైక్వాండో అకాడమిలో 40వ ఏపి స్టేట్ సీనియర్ కుర్గీ, 13వ ఏపి స్టేట్ పూమ్ సే తైక్వాండో చాంపియన్ షిప్స్ -2024 పోటీలు ఉన్నా యన్నారు. ఈ వేర్వేరు పోటీలకి సంబంధించిన క్రీడా కారుల ఎంపిక చేయడం కోసం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకి ఎంపికైన వారు అక్కడ కూడా రాణించి జిల్లా పేరు ప్రతిష్టలను ఇనుమడింప జేయాలని తైక్వాండో శ్రీను పిలుపునిచ్చారు.




### ఎంపికైన క్రీడాకారులు వీరే

తిరుపతిలోని నేషనల్ సంస్కృత యూనివర్శిటీలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 31 నుంచి వచ్చె నెల 1వ తేదిన రెండవ అస్మిత ఉమెన్స్ తైక్వాండో లీగ్ -2024 పోటీలకి ఎంపికైన జిల్లా క్రీడాకారుల వివరాలను శ్రీకాకుళం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. కుర్గీ క్యాడెట్ అండర్ 55 కెజిల విభాగంలో బి.సాయి ప్రియ, జూనియర్ కుర్గీ అండర్ 42 కె.జిల విభాగంలో దనాల జ్యోశ్ని, బండి శిరీష, 44కె.జిల విభాగంలో కె.చందు, అండర్ 63 కె.జిల విభాగంలో ఆర్.హాసిని, 68 కె.జిల విభాగంలో జి.దుర్గా భవానీ, ఓవర్ 68 కె.జిల విభాగంలో ఎస్ .నవ్య,జి.హౌనిత రాజ్ లు ఎంపికైనట్లుగా పేర్కొన్నారు. అదేవిదంగా సీనియర్ కుర్గీ లో అండర్ 46 కె.జిల విభాగంలో ఏ.మనీషా,ఎల్.జగదీశ్వరిలు, అండర్ 53 కె.జిల విభాగంలో వి.జాస్మిన్ ,వై.మౌనిక,అండర్ 57 కె.జిల విభాగంలో డి.నాగమ్మ.పూజిత, అండర్ 73లో ఏ.గాయత్రి, ఓవర్ 73లో సిహెచ్ సంధ్యారాణిలు, సీనియర్ పూమ్ సే ఇండివిద్యూవల్ లో ఎల్.జగదీశ్వరిలు ఎంపికైనట్లుగా తెలిపారు.

### సీనియర్స్ తైక్వాండో చాంపియన్ షిప్స్ పోటీలకు..


తిరుపతిలోని కరకంబడి రోడ్డులో గల తైక్వాండో అకాడమిలో ఈ నెల 31,వచ్చెనెల 1వ తేదిన జరుగనున్న 40వ ఏపి స్టేట్ సీనియర్ కుర్గీ,13వ ఏపి స్టేట్ పూమ్ సే తైక్వాండో చాంపియన్ షిప్స్ - 2024 పోటీలకి ఎంపికైన క్రీడాకారుల వివరాలను అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. కుర్గీ సీనియర్ పురుషుల కేటగిరిలో అండర్ 87 కె.జిల విభాగంలో జి.గణసాయి, మహిళల సీనియర్ విభాగంలో అండర్ 46 కె.జిలలో ఎ.మనీషా,ఎల్.జగదీశ్వరి, అండర్ 53 కె.జిల విభాగంలో వి.జాస్మిన్ ,వై.మౌనిక,అండర్ 57 కె.జిల విభాగంలో డి.ఆగనమ్మ,పూజిత,అండర్ 73 కె.జిల విభాగంలో ఏ.గాయత్రి ,ఓవర్ 73 కె.జిల విభాగంలో సిహెచ్.సంద్యారాణి,సీనియర్ మహిళా పూమ్ సే విభాగంలో ఇండివిద్యూయల్ ఎల్ .జగదీశ్వరిలు ఎంపికైనట్లు తెలియజేసారు. ఎంపికైన ఈ టీంలకి కోచ్ లుగా మజ్జి గౌతమ్ ,మోర్తా సాయి బాలాజీ లు వ్యవహరించనున్నట్లుగా తెలియజేసారు. జిల్లా స్థాయి పోటీల నిర్వహణలో తైక్వాండో నవీన్, శాప్ కోచ్ లక్ష్మణ్ , జోగిపాటి వంశీ, ఎన్.శేఖర్, హరి పాల్గొన్నారు.



## రక్తదానానికి ముందుకురావాలి

**పలాస, ఆగస్టు 26 (వార్త):** రక్తదానం చేయడం ద్వారా ప్రాణా పాయ స్థితిలో ఉన్న మరొకరి ప్రాణం కాపాడవచ్చని పలాస జీడి కార్మికుల సంఘం అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి అన్నారు. పలాస జీడి కార్మిక సంఘం కార్యాలయంలో పలాస ఆ నలుగురు ట్రస్ట్, కాష్యు లేబర్, రైస్ మిల్లర్స్ యూని యన్ ఆధ్వర్యంలో టెక్కలి ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ప్రతీ ఆరు నెలలకు రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆ నలుగురు సంస్థ నుంచి మహిళలు రక్తదానం చేయడం మరింత మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. అనంతరం 31మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చిం తాడ సుధీర్ కుమార్, డాక్టర్ చిన్నంనాయుడు ఆ నలుగురు ట్రస్ట్ సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, మన్మధ రాజు, శివారెడ్డి, దీనబంధు, సభ్యులు రాము భీమారావు సింహచలం పాపారావు గణపతి కూర్మారావు పాల్గొన్నారు.

## ఘనంగా మదర్ థెరీసా జయంతి వేడుకలు



**పలాస, ఆగస్టు26 (వార్త):** మదర్ థెరీసా జీవితం ఆదర్శప్రాయమని, ఎంతో మంది అభాగ్యులను అక్కున చేర్చుకుని ఆదుకున్న వ్యక్తి మదర్ థెరీసా అని మదర్ థెరీసా పాఠశాల చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని అన్నారు. పలాస మదర్ థెరీసా పాఠశాలలో సోమవారం మదర్ థెరీసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో ఉన్న మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనం నుంచే చదువుతో పాటు సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలన్నారు. కార్యక్ర మంలో పాఠశాల ఇన్చార్జి ఆర్ ప్రసాదరావు, జోగారావు, కూర్మారావు, చిరంజీవి, శశిరేఖ, స్రవంతి, బేబీ, జీవరత్నం, యశోద, కల్పన, సావిత్రి పాల్గొన్నారు.

## 31 వరకూ క్రీడా వారోత్సవాలు

**శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 26 (వార్త):** మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్క రించుకుని ఈనెల 26 నుంచి 31 వరకు క్రీడా వారోత్సవాలు నిర్వహించ నున్నట్లు సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం ఉదయం కోడి రామ్మూర్తి స్టేడియంలో క్రీడాకారులచే ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ 27న క్రీడా మైదానాల్లో పోటీలు, 28న వివిధ ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడా పోటీలు, 29న ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగుల, వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి ర్యాలీ, 30, 31న అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో క్రీడాంశాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. చురుకైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకోవడానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శ్రీధర్, మేనేజర్ అప్పలనాయుడు, పర్యాటకశాఖ అధికారి ఎన్ .నారాయణరావు, కోచ్‌లు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





**పలాస, ఆగస్టు 26 (వార్త):** కాశీ బుగ్గ రథయాత్ర మైదానంలో పలాస నియోజకవర్గం యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాన పద, సాంప్రదాయ నృత్య పదర్శనలు, గిరిజన ధింసా నృత్యం, సంగెడిరాళ్ల పోటి, ఉట్టికొట్టడం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజి, విజయలక్ష్మి దంపతులు, పలాస సమన్వయ కర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుని విగ్రహానికి ఉదయం 6 గంటల నుంచి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రేగులపాడు గ్రామానికి చెందిన తప్పెడగుళ్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, బొడ్డపాడు కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, జాలారీ నృత్యా లు, పలాసకు చెందిన మహిళా బృందం కోలాట ప్రదర్శన హైలెట్గా నిలి చాయి. ఈ సందర్భంగా సాంప్రదాయ సంగెడిరాళ్ల పోటీలు నిర్వహించి బహుమతులు అం దించారు. అనంతరం గౌతు శివాజీ దంపతులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరికు ఘనంగా సన్మానించారు. సుమారు ఐదు వేల మందికి అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, దాసరి తాతా రావు, కిక్కర ఢిల్లీరావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్, గురిటి సూర్యనారాయణ, సవర రాంబాబు, కొండే నర్సింహులు, దడియాల నర్సింహులు, మన్యయాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి:** శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా మండలంలో కారిపేట, గొదలాం, కోటబొమ్మాళి ఆర్ఎస్, నౌపడ, దండుగోపాలపురం, తదితర గ్రామాలలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కారిపేట శ్రీ కృష్ణ మందిరంలో కొమర అప్పయ్య ఆధ్వర్యంలో ఏటా ఈ వేడుకలు జరుగుతున్నాయి. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన తో ప్రారంభం అయిన ఈ వేడుకలు పూజ కార్యక్రమం, యజ్ఞ హెూమం అన్న సమారాధన, సత్సంగ కార్యక్రమంలో జరిగాయి. అలాగే గొదలాంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోపూజా, తప్పిటి గుళ్ళు కార్యక్రమం నిర్వహించారు. అలాగే కోటబొమ్మాళి ఆర్ఎస్ గ్రామంలో ( సకలాభక్తుల సహదేవుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరి గాయి. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు బాడాన రాజశేఖర్ ఆధ్వ ర్యంలో సత్సంగ కార్యక్రమం జరిగింది. నౌపడలో ఉట్టిని కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామారావు

**సంతబొమ్మాళి, ఆగస్టు26(వార్త):** శ్రీకాకుళం జిల్లా డీలర్ల సం ఘం అధ్యక్షుడిగా బోరుభద్ర గ్రామానికి చెందిన డీలర్ ఆరంగి రామారావు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం వైశ్య కళ్యాణ మండపంలో సోమవారం జిల్లా లోని 20మండలాలకు చెందిన డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు హాజరై నూతన సంఘాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నక్క రవికుమార్జి, జిల్లా ఉపాధ్యక్షులుగా పట్నాన కోటేశ్వరావు, కోశాధికారిగా కొత్తకోట నాగరాజు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షులుగా పి.వెంకట్ రావు, కార్యదర్శిగా సిహెచ్ అసిరి నాయుడు , టెక్కలి డివిజన అధ్యక్షులుగా కే రంజిత్ కుమార్, కార్యదర్శిగా పి.ప్రభాకర్, కొత్తూరు మండలం, పలాస డివిజన్ అధ్య క్షులుగా కొత్తకోట నాగరాజు, సెక్రెటరీగా ఇచ్చాపురం దిలీప్ ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ ఎన్నికలు ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ ఎస్ సూర్యారావు, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం భుజంగరావు ఆధ్వర్యంలో జరిగాయి.



## స్నేహితుడికి ఆర్థిక సాయం

**సంతబొమ్మాళి, ఆగస్టు26(వార్త):**భావనపాడు గ్రామానికి చెందిన సోమేశ్వరరావు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతుండడంతో మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి (1998-99) పూర్వ విద్యార్థులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. తమతో చదువుకున్న స్నేహితుడు సోమేశ్వరరావుకు రూ.45270వైద్య ఖర్చులకు అందించారు. దాతలు ముందుకు వచ్చి సోమేశ్వరరావుకు ఆర్థికంగా ఆదుకోవాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు వాడరేవు రవికుమార్, బి.బాలరాజు, కె.రవి, అట్టాడ గోపి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎం.మరువాడకు..

## బస్సు సౌకర్యం కల్పించండి

### మంత్రి అచ్చెన్నకు మత్స్యకారుల వినతి

**సంతబొమ్మాళి, ఆగస్టు26 (వార్త):** మండలంలో మత్స్యకార గ్రామమైన ఎం.మరువాడ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేనందున ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర మత్స్య, వ్యవ సాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు గ్రామ సర్పంచ్ ప్రతి నిధి, జిల్లా టీడీపీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సూరాడ దాసురాజు కోరారు. సోమవారం కోటబొమ్మాళి క్యాంపు కార్యాలయంలో మంత్రికి దాసు రాజుతో పాటు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ గ్రామం నుండి టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం పట్టణ ప్రాంతాలకు ఇక్కడ నుండి మత్స్యకార మహిళలు చేపల వ్యాపారం నిమిత్తం వెళుతూ ఉంటారని, బస్సు సౌకర్యము లేనందున వారు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. విద్యార్థిని విద్యార్థులు బస్సు సౌకర్యం లేనందున ప్రైవేటు వాహనాలపై రాకపోకలు చేయడం వల్ల సకాలంలో పాఠశాలలకు, కాలేజీలకు చేరుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గతంలో ఇక్కడినుండి బస్సులు రాకపోకలు ఉండేవని, ఇప్పుడు బస్సులు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలని కోరారు. అలాగే ఉద యం ఏడు గంటలకు ఒక సర్వీస్, పదకొండు గంటలకు గ్రామ ప్రజలకు అత్య వసరమైన మధ్యాహ్నం బస్సు సర్వీస్ సౌకర్యం ప్రారంభించాలని మంత్రికి ఆయన కోరారు. దీనిపైన మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ ఆర్టీసీ బస్సు పునరుద్ధరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

### జిల్లాలో రెండు ఇసుక స్టాక్

## పాయింట్లు ప్రారంభం

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్




**శ్రీకాకుళం, ఆగస్టు 26(వార్త):** జిల్లాలో కొత్తగా రెండు ఇసుక స్టాక్ పాయింట్లను ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ తెలిపారు. గార మండలం శాలిహుండం, బూర్జ మండలం ఖాఖండ్యం వద్ద కొత్తగా రెండు ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ స్టాకు పాయింట్ల నుంచి ఇసుకను పొందుటకు గాను ముందుగా సంబంధిత బుకింగ్ పాయింట్ల వద్ద నమోదు చేసుకుని బుకింగ్ స్లిప్పును పొందాలన్నారు. సోమవారం నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు, ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన ఇసుక పొందుటకు బుకింగ్ స్లాట్ కేటాయిస్తామన్నారు. బుకింగ్ పాయింట్ల వద్దకు ఎటువంటి వాహనాలు తీసుకురాకూడదని తెలిపారు. బుకింగ్ పాయింట్ల వద్దకు వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరన్నారు. శాలిహుండం స్టాక్ పాయింట్ నుంచి ఇసుక పొందుటకు శాలిగుండం గ్రామ సచివాలయం వద్ద గల బుకింగ్ కౌంటర్‌లో ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఖా ఖండ్యం స్టాక్ పాయింట్ వద్ద ఇసుక పొందుటకు లంకాం, మామిడివలస గ్రామ సచివాలయంలో బుకింగ్స్ స్లిప్ పొందాలన్నారు. స్టాక్ పాయింట్ వద్దకు వాహనములను అనుమతించినా నిర్ణీత స్లాట్ సమయానికి మాత్రమే విడిచిపెడతారని చెప్పారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద చెక్ పోస్ట్ సీసీటీవీ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇసుక రవాణా దారులు బుకింగ్ పాయింట్ వద్ద లేదా శ్రీకాకుళం ఆర్టీవో కార్యాలయం వద్ద ఆధార్ నంబరు ఫోన్ నెంబరు, అడ్రస్సు, కస్టమర్ యొక్క ఫోన్ నెంబరు నమోదు చేసుకోవాలన్నారు. ఒక ఆధార్ నంబరు ఒక వినియోగదారునికి ఒక రోజుకు 20 టన్నుల మాత్రమే స్టాక్ పాయింట్ వద్ద అనుమతిస్తారని తెలిపారు. స్టాక్ పాయింట్ల వద్ద ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రము 6 గంటల వరకు ప్రతి రెండు గంటలకు ఒక స్లాట్ గా విభజించి వాహనములకు సంబంధిత అనుమతి కలికలిగిన స్లాట్ సమయానికి అనుమతిస్తారన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు స్టాక్ పాయింట్ వద్ద మంజూరు చేస్తారని తెలిపారు. ఏదైనా సమస్యలు ఉంటే వాట్సప్ నెంబర్ 9701691657 టోల్ ఫ్రీ నెంబర్ 1800-425-6012 సంప్రదించాలన్నారు.

### ఎం.మరువాడకు..

## బస్సు సౌకర్యం కల్పించండి

### మంత్రి అచ్చెన్నకు మత్స్యకారుల వినతి

**సంతబొమ్మాళి, ఆగస్టు26(వార్త):** మండలంలో మత్స్యకార గ్రామమైన ఎం.మరువాడ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేనందున ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర మత్స్య, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు గ్రామ సర్పంచ్ ప్రతి నిధి, జిల్లా టీడీపీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సూరాడ దాసురాజు కోరారు. సోమవారం కోటబొమ్మాళి క్యాంపు కార్యాలయంలో మంత్రికి దాసు రాజుతోపాటు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ గ్రామం నుండి టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం పట్టణ ప్రాంతాలకు ఇక్కడ నుండి మత్స్యకార మహిళలు చేపల వ్యాపారం నిమిత్తం వెళుతూ ఉంటారని, బస్సు సౌకర్యము లేనందున వారు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. విద్యార్థిని విద్యార్థులు బస్సు సౌకర్యం లేనందున ప్రైవేటు వాహనాలపై రాకపోకలు చేయడం వల్ల సకాలంలో పాఠశాలలకు, కాలేజీలకు చేరుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గతంలో ఇక్కడినుండి బస్సులు రాకపోకలు ఉండేవని, ఇప్పుడు బస్సులు లేకపోవడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలని కోరారు. అలాగే ఉదయం ఏడు గంటలకు ఒక సర్వీస్, పదకొండు గంటలకు గ్రామ ప్రజలకు అత్య వసరమైన మధ్యాహ్నం బస్సు సర్వీస్ సౌకర్యం ప్రారంభించాలని మంత్రికి ఆయన కోరారు. దీనిపైన మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ ఆర్టీసీ బస్సు పునరుద్ధరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.






## ఆ కుటుంబాలను ఆదుకోండి

**ఆమదాలవలస,ఆగస్టు26 (వార్త):** అచ్యుతాపురం సెజ్ లో ఇటీవల చోటు చేసుకున్న ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని మాజీ స్పీకర్, వైకాపా నాయకుడు తమ్మి నేని సీతారాం పిలుపునిచ్చారు. ఆమదాలవలస మండలం వంజంగి గ్రామానికి చెందిన పైడి రాజశేఖర్, పొందూరు మండలానికి చెందిన హంస ప్రశాంత్ కుటుంబాలను సోమవారం ఆయన పరామర్శించారు. ఫార్మా కంపెనీలలో భద్రతా లోపాలను గుర్తించి ఇకపై ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి పార్టీ పరంగా ఆర్థిక సాయం ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం దీనికి బాధ్యత వహించి, మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలాసలో గోకులాష్టమి వేడుకలు



**పలాస ఆగస్టు 26 (వార్త):**వలాన యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంబరాన్ని అంటాయి. పలాస రైల్వే మైదానంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకృష్ణునికి పూజలు చేశారు. వలాస సేవాసమితి ముఖ్యులు లొడగల కామేశ్వరరావు అధ్యక్షతన భగవద్గీత పారాయణం, గొల్ల చదువు గానం, తప్పెటగుళ్ళు, జాలారి పాట ప్రదర్శణ, కోలాటం, భరత నాట్యం, జానపదాలు, పల్లెపదాలు నృత్యాలు, సంగిరాలు పోటీలు అందరిని అలరించాయి. మధ్యాహ్నం మామిడి తాతారావు సుమారు ఆరువేల మందికి కృష్ణ ప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించిన ఉట్టి కొట్టే సంబరం నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్, మాజీ మంత్రి గౌతుశ్యాంసుందర శివాజీలకు సేవాసమితి ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో యార్లగడ్డ వెంకన్న చౌదిరి, వజ్జ బాబూరావు, దాసరి తాతారావు, అంబటి క్రిష్ణమూర్తి, వంకల కూర్మారావు, సప్ప నవీన్, డొక్కరి శంకర్, దడియాల నరసింహాలు, కొరికాన శంకర్, కొండే నరసింహులు, బద్రి గోపాల్, గురిటి సూర్యనారాయణ, కొర్రాయి బాలక్రిష్ణ, కిక్కర డిల్లీరావు, రొణగల సత్యం, కొండే తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన కారు



**నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త):** మడపాం టోల్ గట్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తు లకు గాయాలయ్యాయి. శ్రీకా కుళం నుంచి నరసన్నపేట వైపు వస్తున్న కారు టోల్ ప్లాజా వద్ద డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమా దంలో కారు డ్రైవర్, బాలుడు, మహిళ గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు.

## మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



**పాతపట్నం, ఆగస్టు 26(వార్త):** ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి మోటార్ సైకిల్‌పై అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పాతపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం పాతపట్నం బస్సు స్టాండ్ వద్ద ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. ఒకరిది సారవ కోట మండలం కాగా మరొ కరిది మెళియాపుట్టి మండలం. వీరి వద్ద నుంచి 2130 విలువ గల 11 మద్యం సీసాలను, ద్విచక్ర వాహనాన్ని స్వాదీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు స్థానిక మీడియాకు ఎస్ఐ యాసిన్ తెలిపారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**నరసన్నపేట, ఆగస్టు 26 (వార్త):**వాహనదారులు తప్పనిసరిగా మోటార్ వాహన చట్టం పరిధి మేరకు నిబంధనలు పాటించాలని నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ జె శ్రీనివాసరావు సూచించారు. సోమవారం సాయంత్రం నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద ఆకస్మికంగా వాహనాలను ఆయన తనిఖీ చేశారు. మైనర్లు ద్విచక్ర వాహనాలను నడపరాదని, వారి తల్లిదండ్రులు దీనిని క్రమ బద్ధీకరించాలని సూచించారు.



జాతీయ **వార్త**
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వైసీపీ నేత లింగయ్య మృతి



**మందస, ఆగస్టు 26 (వార్త):**మందస మండలంలోని భైరిసారంగపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రట్టి లింగయ్య సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్లో లో పనిచేసిన ఆయన ఉద్యోగ విరమణ అనంతరం రాజకీయాల్లో చురుకుగా ఉండేవారు. లింగయ్యకు మంచి మనిషిగా గుర్తింపు ఉంది. దీంతో ఆయన భార్య సరస్వతికి రెండు సార్లు సర్పంచ్‌గా ప్రజలు గెలిపించారు. రెండు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న ఆయనకు మెరుగైన చికిత్సకు శ్రీకాకుళం తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మరణించారు. లింగయ్య మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

# ప్రమాదకరంగా.. ఫ్లైఓవర్

**ఆమదాలవలస,ఆగస్టు26 (వార్త):** జిల్లా కేంద్రం శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస, పాలకొండ, హిరమండలం, కొత్తూరు, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అనుసంధానంగా ఆమదాలవలస పట్టణంలో ఉన్న పురాతన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. శ్రీకాకుళం నుండి ఆమదాలవలస వచ్చే రహదారిలో ఎన్టీఆర్ విగ్రహం కూడలి నుంచి వైఎస్సార్ విగ్రహం కూడలి వరకు విస్తరించి ఉన్న అతి ప్రధానమైన ఈ వంతెన నిర్వహణకు నోచుకోకపోవడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈవంతెన ఫుట్‌పాత్‌కు ఇరువైపులా పూర్తిగా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు భారీగా పెరిగిపోయాయి. విద్యుత్ స్థంబాలకు సైతం పచ్చని పాదులు అల్లుకుపోయాయి. వంతెన దిగువ భాగంలో సుదర్శన్ క్వార్టర్స్ కు వెళ్లే అంతర్గత మార్గంలో ఇరువైపులా గోడలు పూర్తిగా శిథిలమై తుప్పు పట్టిన ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. సంబంధిత అధికారులెవరూ ఈ వంతెన నిర్వహణ బాధ్యతలు చేపట్టకపోవడం వలనే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికయినా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.





# టిడ్కో గృహాలు పూర్తయ్యేదెన్నడో?

*** అసంపూర్తిగా గృహాల నిర్మాణం * మౌలిక సదుపాయాలు కల్పించని గత పాలకులు * ఆరేళ్లుగా లబ్ధిదారులకు ఇవ్వని అధికారులు * లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి నోటీసులు * కూటమి ప్రభుత్వపైనే లబ్ధిదారుల ఆశలు**

**పలాస, ఆగస్టు 26(వార్త):** పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే సుమారు ఆరు సంవత్సరాలు గడుస్తున్నా వాటిని లబ్ధిదారులకు కాబట్టి ఇవ్వలేదు. అద్దె ఇళ్లలో నెలకు వారు వేలాది రూపాయలు అద్దె కట్టుకుంటూ, మరోవైపు చేతికి రాని టిడ్కో ఇళ్లకు సంబంధించిన బ్యాంక్ అప్పు డబ్బులు కట్టుకోలేని పరిస్థితులలో ఉన్నారు. ఇప్పటికీ అప్పులు పూర్తిగా చెల్లించాలంటూ ఒక్కొక్కరికి నాలుగు నోటీసుల చొప్పున బ్యాంకుల అధికారులు పంపించారు. కొందరు నిరక్షరాస్యులకు ఏం చేయాలో తెలియక నిస్సహాయస్థితిలో ఉన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లపై అప్పు ఎవరికి వెళ్లింది.. మొత్తం బ్యాంక్ నుంచి పొందినా సరే ప్రభుత్వం ఎందుకు లబ్దిదారులకు ఇళ్లు ఇవ్వడం లేదన్న ప్రశ్నలు సామాన్యులను వేధిస్తున్నాయి. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంలో ఇంత జాప్యం ఎందుకు చేస్తున్నారో అర్థం కానీ పరిస్థితుల్లో ఉన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహ నిర్మాణపథకం (ఏ హెచ్ పి) సంయుక్తంగా అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో టిడ్కో గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని శ్రీకాకుళం, పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలలో పేద, మధ్యతరగతి ప్రజలకు పక్క గృహాలు నిర్మించాలనే ఉద్దేశంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం రెండు స్టేజీలు కింద 8.973 గృహాలను మంజూరు చేసింది. ఇందులో మొదటి విడతగా శ్రీకాకుళంలో 1,280 గృహాల నిర్మాణం పూర్తి చేసి అందించామని అధికారులు చెబుతుండగా రెండో స్టేజ్లో శ్రీకాకుళంలో 1392, అమదాలవలను 529 ఇచ్ఛాపురంలో 616, పలాసలో 1,908, విజయనగరం జిల్లా రాజాంలో 1,104 గృహాలను మంజూరు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 25 శాతం కన్నా తక్కువగా జరిగిన పనులకు సంబంధించిన గృహాల నిర్మాణాలు చేపట్టవద్దని చెప్పడంతో పలాసలో 912. ఇచ్ఛాపురంలో 192, అమదాలవలనలో 328 శ్రీకాకుళంలో 624, రాజాంలో 336 గృహాలకు సంబంధించిన పనులు చేవడుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. 8,572 గృహాలకు గాను 3.372 గృహాల నిర్మాణ పనులు జరిగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం ఈ ఇళ్ల ఆ పార్టీ రంగులు వేసిందే తప్ప ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదు.



చాలా వరకూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేదు. గృహాల సముదాయం వద్ద మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు. ఎన్నికల ముందు టీడీపీ నాయకులు వాటి వద్దకు వెళ్లి సెల్ఫీలు దిగారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టి సుమారుగా మూడు నెలలు కావస్తున్నా టిడ్కో గృహాల ఊసేలేదు. అధికారులు మాత్రం జనవరి నాటికి పూర్తి చేసి అప్పగిస్తామని చెబుతుండడం గమనార్హం.

### ఇళ్లు చేతికి రాకున్నా.. లబ్ధిదారులకు నోటీసులు

టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయి. ప్రస్తుతం ఏహెచ్‌పి గృహ సముదాయం వద్ద టిడ్కో గృహాల లబ్ధిదారులకు బ్యాంకర్లు ఇళ్లకు తీసుకున్న రుణానికి అసలు, వడ్డీ కలిపి చెల్లించాలని, లేకుంటే బ్యాంకు నిబంధనల ప్రకారం జప్తు చేయాల్సి వస్తుందని నోటీసులు అంటించారు. పలాసలో ఈనెల 4న ఒక ప్రకటన విడుదల చేస్తూ వాటి పత్రాలను సంబంధిత గృహాలకు అతికించారు. దీంతో లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తాము అద్దె గృహాల్లో రూ. వేలకు వేలు కట్టుకోని వివాసం ఉంటున్న తరుణంలో లేని ఇళ్లకు తాము అప్పులు ఏ విధంగా తీర్చుతామో బ్యాంకర్లు సమాధానం చెప్పాలని వారు ప్రశ్నిస్తున్నారు. లబ్ధిదారులకు 2019 నుంచి 2021 వరకు వివిధ మున్సిపాలిటీలో 365 చదరపు గజాలకు రూ. 3.15 లక్షలు, 430 చదరపు గజాల విస్తీర్ణంకు రూ. 3.55 లక్షలు రుణాలను బ్యాంకులు మంజూరు చేసింది. నెలకు రూ.2.500 నుండి 4,000 వరకు బ్యాంకులకు 30 ఏళ్ల పాటు లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంది. గృహాలను ప్రభుత్వం లబ్ధిదారులకు అప్పగించక పోవడంతో బ్యాంకులకు వాయిదాలు చెల్లించడం లేదు. దీంతో బ్యాంకర్లు లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడం ప్రారంభించారు.

### ముందుకు రాని కాంట్రాక్టర్లు...

టిడ్కో గృహాలను నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. చేసిన పనులకు అనుగుణంగా బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారుల పాలిట శాపంగా మారింది. జిల్లావ్యాప్తంగా చేపడుతున్న గృహాల నిర్మాణానికి సుమారు రూ.300 కోట్లు కేటాయించగా అదే స్థాయిలో చేసిన పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో వనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

### కూటమి ప్రభుత్వ హామీపైనే ఆశలు...

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపైనే టిడ్కో గృహాల లబ్ధిదారులు ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ ఎన్నికల సమయంలో టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. నెలలు గడుస్తున్న టిడ్కో గృహాల ఊసే ఎత్తకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలకు నోటీసులు ఇస్తుండగా మరోవైపు అద్దె ఇళ్లకు అద్దెలు చెల్లించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం చొరవ చూపి టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తి చేసి తమకు కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నాడు.



### జనవరి నాటికి పూర్తి చేస్తాం

టిడ్కో గృహాలకు సంబంధించి పనులు జరుగుతున్నాయని కాంట్రాక్టర్లను ఒప్పించి పనులు చేవడుతున్నాం. ఇప్పటివరకు సుమారు రూ.180 కోట్ల బిల్లులు చెల్లించాం. జిల్లావ్యాప్తంగా టిట్కో గృహాల వద్ద రహదారులు, తాగునీరు, విద్యుత్ సరఫరా పనులు మాత్రమే పెండింగ్లో ఉన్నాయి. టిడ్కో గృహాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. మరో ఆరు నెలల్లో పనులు పూర్తి చేసి జనవరి వాటికి లబ్ధిదారులకు గృహాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

**– మూర్తి, ఈఈ, టిడ్కో**

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413